సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 4 । జూన్ । 2024



అటెన్షన్ వైజాగ్..

మంగళవారం ప్రత్యేకమైన రోజు. నేతల తలరాతలు మార్చే రోజు. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీలో నిలిచిన అభ్యర్థుల గుండెల్లో రైళ్లను పరుగెత్తిస్తున్న రోజు. విజేతలు ఎవరో.. పరాజితులు ఎవరో తేలేరోజు. మరికొద్ది గంటల్లో ఓటరు తీర్పు వెలువడే బిగ్ డే. నగరవాసులంతా ఊపిరి పీల్చుకునే తరుణం. తమ నియోజకవర్గంలోని ఏ కాలనీ, ఏ అపార్ట్‌మెంట్, ఏ ప్రాంతం ఎవరి వైపు మొగ్గు చూపాయోనని ఉత్కంఠను రేపుతున్న రోజు. గెలుపెవరిదో.. ఓటమెవరిదో ఇంకొద్ది గంటల్లోనే తేల్చే క్షణాలకు నిరీక్షణాలకు తెరపడే. అసలు సిసలు మజాను పంచే అరుదైన రోజు.





టిక్ టిక్



లబ్ డబ్!

నేడే ఓట్ల లెక్కింపు







ఏయూలోని కౌంటింగ్ కేంద్రం వద్ద ఉద్యోగులు

సాక్షి, విశాఖపట్నం : ఎన్నాళ్లో వేచిన ఉదయం ఈనాడే ఎదురవుతుంటే.. ఇంకా తెలవారదేమి.. ఈ చీకటి విడిపోదేమి?' అంటూ ఓ సినీ కవి రాసినట్టు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న సమయం ఆసన్నమైంది. దాదాపు 21 రోజుల నుంచి ఊపిరి బిగబట్టుకుని ఉన్న వారి ఉత్కంఠకు నేడు తెరపడనుంది. అభ్యర్థుల భవితవ్యం నిక్షిప్తమైన ఈవీఎంలు పటిష్ట భద్రత నడుమ తెరుచుకోనున్నాయి. మే 13న జరిగిన ఎన్నికల్లో విశాఖ జిల్లాకు సంబంధించి ఒక ఎంపీ స్థానం, ఏడు అసెంబ్లీ స్థానాల లెక్కింపు ప్రక్రియ ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో ఉదయం 8 గంటలకు ప్రారంభంకానుంది. మధ్యాహ్నానికల్లా ఫలితాల సరళి వెల్లడవుతుంది. సాయంత్రానికి ఇటు అభ్యర్థుల గెలుపోటములు, అటు రాష్ట్రంలో ప్రభుత్వం ఏ పార్టీ ఏర్పాటు చేస్తుందో తేటతెల్లమవుతుంది. ఇప్పటికే ఈ ఎన్నికల్లో పోటీ చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు, వారి అనుచరగణం, కార్యకర్తలు, నాయకులతో పాటు ఆయా పార్టీల సానుభూతిపరులు మంగళవారం వెలువడే ఫలితాల కోసం కంటి మీద కునుకు లేకుండా ఎదురు చూస్తున్నారు. గుళ్లు, గోపురాలు, చర్చిలు, మసీదులకు వెళ్లి ఎవరి ఇష్టదైవాలకు వారు గెలుపు కోసం ప్రార్థిస్తున్నారు. మరోవైపు గెలుపుపై ధీమాతో ఉన్న అభ్యర్థులు, వారి అనుచరులు మాత్రం విజయోత్సవాలకు అవసరమైన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో స్క్రీన్ ఏర్పాటు

కొమ్మాది: ఎండాడలో గల వైఎస్సార్ సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం ఎన్నికల ఫలితాల సందర్భంగా స్క్రీన్ ఏర్పాటు చేయనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు తెలిపారు.



ఏయూలోని కౌంటింగ్ కేంద్రం



కౌంటింగ్ బందోబస్తు కోసం ఏయూకు చేరుకున్న పోలీసు బలగాలు

ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ మొదలు

తొలి ఫలితం విశాఖ పశ్చిమ.. చివరిగా భీమిలి

రాత్రి 9.30 గంటలకు విశాఖ పార్లమెంట్ ఫలితం వెలువడే అవకాశం

అసెంబ్లీ ఫలితాలకు 98 టేబుల్స్‌లో 143 రౌండ్లు

అభ్యర్థుల్లో టెన్షన్.. గెలుపోటములపై చర్చోపచర్చలు

తొలి ఫలితం పశ్చిమదే..

పోలైన ఓట్ల పరంగా తొలి ఫలితం విశాఖ పశ్చిమ నియోజకవర్గానిది వెలువడనుంది. చివరిగా రాష్ట్రంలోనే అత్యధిక ఓటర్లున్న భీమిలి ఫలితం వెలువడే అవకాశం ఉంది. అదేవిధంగా రాత్రి 9.30 గంటల తర్వాత విశాఖ పార్లమెంట్ ఫలితం తేలనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఫలితాలు ఆలస్యమైనా ఓటర్లు ఎవరి వైపు మొగ్గు చూపారన్న విషయం మధ్యాహ్నం 12 గంటలకే స్పష్టత వచ్చేస్తుంది. జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల ఫలితాలకు మొత్తం 98 టేబుల్స్ ఏర్పాటు చేశారు. మొత్తం 143 రౌండ్లలో కౌంటింగ్ జరగనుంది. మరోసారి ఫ్యాన్ ప్రభంజనం కనిపిస్తుండగా.. అంబరాన్నంటే సంబరాలు చేసుకునేందుకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు, పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేసుకున్నారు.

మరోసారి ఫ్యాన్ ప్రభంజనమే..

మరోవైపు ప్రీపోల్, ఎగ్జిట్ పోల్స్ సర్వేలన్నీ వైఎస్సార్‌సీపీ గెలుపును ఖాయం చేశాయి. మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించబోతుందని తేల్చేశాయి. పుట్టింది మొదలు ఉద్యమాలతో ఉరకలెత్తుతూ ప్రజాక్షేత్రంలో ప్రజాసమస్యలపై అవిశ్రాంత పోరాటం చేసిన వైఎస్సార్‌సీపీ గత ఎన్నికల్లో విజయదుందుభి మోగించింది. ఉమ్మడి విశాఖలో ఏకంగా 11 స్థానాల్లో జయకేతనం ఎగురవేసింది. విశాఖ నగరంలోని నాలుగు నియోజకవర్గాల్లో టీడీపీ విజయం సాధించగా.. ఈసారి ఆ స్థానాలన్నింటిలోనూ ఫ్యాన్ గాలి వీస్తుందని అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన ఎగ్జిట్‌పోల్స్ అన్నీ తమకు వ్యతిరేకంగా రావడంతో టీడీపీ శ్రేణులు తీవ్ర నిరుత్సాహం ఉన్నా.. మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ.. ఎన్నికల ముందు ఇచ్చిన తాయిలాలు తమను గట్టెక్కించకపోతాయా అన్న దింపుడు కళ్లెం ఆశతో ఉన్నారు.



విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గం	
మొత్తం పోలైన ఓట్లు	13,70,484
మొత్తం కౌంటింగ్ హాల్స్	7
కౌంటింగ్ టేబుల్స్	98
మొత్తం రౌండ్లు	140
కౌంటింగ్ పర్యవేక్షణ సిబ్బంది	294 మంది
పోస్టల్ బ్యాలెట్ ఓట్లు	25,681
కౌంటింగ్ హాల్స్	2
కౌంటింగ్ టేబుల్స్	18
మొత్తం రౌండ్లు	3
కౌంటింగ్ పర్యవేక్షణ సిబ్బంది	90 మంది
ఫలితం	రాత్రి 9.30 గంటలకు..

భీమిలి నియోజకవర్గం

మొత్తం పోలైన ఓట్లు : 2,75,747
మొత్తం కౌంటింగ్ హాల్స్ : 01
కౌంటింగ్ టేబుల్స్ : 14
మొత్తం రౌండ్లు : 26
కౌంటింగ్ పర్యవేక్షణ సిబ్బంది : 42 మంది
పోస్టల్ బ్యాలెట్ ఓట్లు : 5,708
మొత్తం కౌంటింగ్ హాల్స్ : 1
కౌంటింగ్ టేబుల్స్ : 7
మొత్తం రౌండ్లు : 2
కౌంటింగ్ పర్యవేక్షణ సిబ్బంది : 33 మంది
ఫలితం : సుమారు రాత్రి 9.30 గంటలకు

విశాఖ తూర్పు

మొత్తం పోలైన ఓట్లు : 2,00,563
మొత్తం కౌంటింగ్ హాల్స్ : 01
కౌంటింగ్ టేబుల్స్ : 14
మొత్తం రౌండ్లు : 21
కౌంటింగ్ పర్యవేక్షణ సిబ్బంది : 42 మంది
పోస్టల్ బ్యాలెట్ ఓట్లు : 3905
మొత్తం కౌంటింగ్ హాల్స్ : 1
కౌంటింగ్ టేబుల్స్ : 5
మొత్తం రౌండ్లు : 2
కౌంటింగ్ పర్యవేక్షణ సిబ్బంది : 24 మంది
ఫలితం : సుమారు రాత్రి 7 గంటలకు

విశాఖ దక్షిణ

మొత్తం పోలైన ఓట్లు : 1,37,474
మొత్తం కౌంటింగ్ హాల్స్ : 01
కౌంటింగ్ టేబుల్స్ : 14
మొత్తం రౌండ్లు : 17
కౌంటింగ్ పర్యవేక్షణ సిబ్బంది : 42 మంది
పోస్టల్ బ్యాలెట్ ఓట్లు : 2105
మొత్తం కౌంటింగ్ హాల్స్ : 1
కౌంటింగ్ టేబుల్స్ : 3
మొత్తం రౌండ్లు : 2
కౌంటింగ్ పర్యవేక్షణ సిబ్బంది : 12 మంది
ఫలితం : సుమారు సాయంత్రం 5 గంటలకు

విశాఖ ఉత్తర

మొత్తం పోలైన ఓట్లు : 1,84,703
మొత్తం కౌంటింగ్ హాల్స్ : 01
కౌంటింగ్ టేబుల్స్ : 14
మొత్తం రౌండ్లు : 20
కౌంటింగ్ పర్యవేక్షణ సిబ్బంది : 42 మంది
పోస్టల్ బ్యాలెట్ ఓట్లు : 3,606
మొత్తం కౌంటింగ్ హాల్స్ : 1
కౌంటింగ్ టేబుల్స్ : 4
మొత్తం రౌండ్లు : 2
కౌంటింగ్ పర్యవేక్షణ సిబ్బంది : 19 మంది
ఫలితం : సాయంత్రం 6.30 గంటలకు..

విశాఖ పశ్చిమ

మొత్తం పోలైన ఓట్లు : 1,48,942
మొత్తం కౌంటింగ్ హాల్స్ : 01
కౌంటింగ్ టేబుల్స్ : 14
మొత్తం రౌండ్లు : 16
కౌంటింగ్ పర్యవేక్షణ సిబ్బంది : 42 మంది
పోస్టల్ బ్యాలెట్ ఓట్లు : 2716
మొత్తం కౌంటింగ్ హాల్స్ : 1
కౌంటింగ్ టేబుల్స్ : 3
మొత్తం రౌండ్లు : 2
కౌంటింగ్ పర్యవేక్షణ సిబ్బంది : 12 మంది
ఫలితం : సాయంత్రం 4.30 గంటలకు

గాజువాక

మొత్తం పోలైన ఓట్లు : 2,32,949
మొత్తం కౌంటింగ్ హాల్స్ : 01
కౌంటింగ్ టేబుల్స్ : 14
మొత్తం రౌండ్లు : 22
కౌంటింగ్ పర్యవేక్షణ సిబ్బంది : 42 మంది
పోస్టల్ బ్యాలెట్ ఓట్లు : 4126
మొత్తం కౌంటింగ్ హాల్స్ : 1
కౌంటింగ్ టేబుల్స్ : 6
మొత్తం రౌండ్లు : 2
కౌంటింగ్ పర్యవేక్షణ సిబ్బంది : 24 మంది
ఫలితం : సుమారు రాత్రి 7.30 గంటలకు..

పెందుర్తి

మొత్తం పోలైన ఓట్లు : 2,28,740
మొత్తం కౌంటింగ్ హాల్స్ : 01
కౌంటింగ్ టేబుల్స్ : 14
మొత్తం రౌండ్లు : 21
కౌంటింగ్ పర్యవేక్షణ సిబ్బంది : 42 మంది
పోస్టల్ బ్యాలెట్ ఓట్లు : 4651
మొత్తం కౌంటింగ్ హాల్స్ : 1
కౌంటింగ్ టేబుల్స్ : 5
మొత్తం రౌండ్లు : 3
కౌంటింగ్ పర్యవేక్షణ సిబ్బంది : 22 మంది
ఫలితం : సుమారు రాత్రి 7.00 గంటలకు..

తొలుత పోస్టల్, సర్వీస్ ఓట్ల లెక్కింపు

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కోసం ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు. పోస్టల్, సర్వీస్ ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటలకు ప్రారంభమైన తర్వాత ఈవీఎంల కౌంటింగ్ ప్రక్రియ మొదలుపెడతారు. లోక్‌సభ, అసెంబ్లీల వారీగా ఈవీఎంలను వేర్వేరుగా రెండు స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపర్చారు. కౌంటింగ్ కోసం కూడా అదే విధంగా ప్రతి నియోజకవర్గానికి రెండు కౌంటింగ్ హాళ్లు ఏర్పాటు చేశారు. సీరియల్ ప్రకారం పోలింగ్ బూత్‌ల వారీగా అసెంబ్లీ, లోక్‌సభ ఈవీఎంలను వేర్వేరుగా రౌండ్‌కు 14 చొప్పున బయటకు తీసుకొస్తారు. తొలి రౌండ్ లెక్కింపు పూర్తవడానికి కనీసం అరగంట సమయం పడుతుంది. 9 గంటలకల్లా తొలి రౌండ్ ఫలితం వచ్చే అవకాశం ఉంది. లెక్కింపు పూర్తయిన తర్వాత వివరాలను ఈసీకి పంపడంతో పాటు సువిధ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. అలా చేసిన తర్వాతే రౌండ్ ఫలితాలను అధికారికంగా వెల్లడిస్తారు. ఆ తర్వాత మళ్లీ రెండో రౌండ్‌కు సంబంధించిన ఈవీఎంలను కౌంటింగ్ హాలుకు తీసుకొస్తారు. ఇలా రౌండ్ల వారీగా లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుంది.

ఫలితాల వెల్లడిలో జాప్యం వద్దు

ఆర్వోలకు జిల్లా ఎన్నికల అధికారి మల్లికార్జున ఆదేశం

మహరాణిపేట : ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయిన వెంటనే రౌండ్ల వారీ ఫలితాలను ఎప్పటికప్పుడు జాప్యం లేకుండా వెల్లడించేలా చూసుకోవాలని ఆయా నియోజకవర్గాల ఆర్వోలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున సూచించారు. వెంటనే నిర్దేశిత వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేయటంతో పాటు మీడియాకు కూడా ఫలితాలను అందించాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో ఆర్‌వోలతో సమీక్ష నిర్వహించారు. కౌంటింగ్ ఏజెంట్లకు కనీస వసతులు కల్పించాలని, జాతీయ, ప్రాంతీయ గుర్తింపు పొందిన పార్టీల వారికి ముందు వరుసలో, రిజిస్టర్ అయ్యి గుర్తింపు పొందని పార్టీల ఏజెంట్లకు రెండో వరుసలో, స్వతంత్ర అభ్యర్థుల తాలూక ఏజెంట్లు మూడో వరుసలో కుర్చీలు వేయాలని సూచించారు. ఏజెంట్లకు తాగునీటి వసతి కల్పించాలన్నారు. చెల్లింపు విధానంలో ఏజెంట్లకు భోజనం సమకూర్చాలని చెప్పారు. కేంద్రంలోపలకు వచ్చే ఏజెంట్లు ఫోన్లు తీసుకురావడానికి వీలులేదని, ఒక బాల్ పాయింట్ పెన్ను లేదా పెన్సిల్, తెల్లకాగితం తెచ్చుకోవచ్చని స్పష్టం చేశారు.

ఆర్వోలు అన్ని అంశాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. సంయమనం పాటించాలని, క్లిష్టమైన పరిస్థితులు ఎదురైనప్పుడు సమయస్ఫూర్తితో వ్యవహరించి తక్షణ నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఈటీపీబీఎస్ ద్వారా వచ్చిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లను మంగళవారం ఉదయం 7.59 గంటల వరకు కూడా అనుమతించవచ్చని స్పష్టం చేశారు. పోస్టల్ డిపార్ట్‌మెంట్‌కు వచ్చిన ఆయా బ్యాలెట్లు నిర్ణీత సమయానికి కౌంటింగ్ కేంద్రాలకు వచ్చేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పోలీసు శాఖతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఉదయం 6 గంటలకు పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్‌లను తెరవాలని, ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను 7.30 గంటలకు తెరవాలని సూచించారు. ఈ ప్రక్రియ అంతా అభ్యర్థులు లేదా ఏజెంట్ల సమక్షంలో జరగాలని, వీడియోగ్రఫీ చేయాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు విషయంలో ఈసీ ఇచ్చిన ఆదేశాలను, నిబంధనలను అనుసరించాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, ఎంసీసీ నోడల్ అధికారి సీఎం సాయికాంత్ వర్మ, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి, ఏడీసీ కేఎస్ విశ్వనాథన్, ఆర్వోలు పాల్గొన్నారు.



ఆర్‌వోలతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

నిబంధనలు తప్పక పాటించాలి

- పోస్టల్ బ్యాలెట్ లెక్కింపులో జాగ్రత్త అవసరం
- జిల్లా ఎన్నికల అధికారి మల్లికార్జున

ఏయూక్యాంపస్: పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో ఎన్నికల సంఘం పేర్కొన్న నిబంధనలు, ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా ఇచ్చిన ఆదేశాలకు తప్పక పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున స్పష్టం చేశారు. పార్లమెంట్ స్థానానికి పోలైన పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు కేటాయించిన అధికారులు, సిబ్బందికి ఏయూ ఇంజినీరింగ్ కళాశాల పరిధిలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో సోమవారం ప్రత్యక్ష శిక్షణ శిబిరం నిర్వహించారు. బ్యాలెట్ ఓట్లను విభజించడం, లెక్కించడం, నివేదికలు తయారుచేయడం తదితర అంశాలపై పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి ఏడీసీ కె.ఎస్.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ అవగాహన కల్పించారు. వాలిడ్, ఇన్వాలిడ్ ఓట్లను విభజించిన తరువాత అనుసరించాల్సిన పద్ధతులు, విధి విధానాల గురించి వివరించారు. ఈటీపీబీఎస్ ఓట్ల లెక్కింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. పార్లమెంట్ నియోజకవర్గ కౌంటింగ్ పరిశీలకుడు, పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్‌తో కలిసి శిక్షణ శిబిరాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ పలు అంశాలపై విధుల్లో భాగమయ్యే అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. విధులకు హాజరయ్యే ప్రతి ఒక్కరూ విధిగా ఐడీ కార్డులను ధరించాలని, ఫోన్లను తీసుకురావద్దని సూచించారు. నిర్ణీత సమయానికి కేంద్రానికి చేరుకోవాలని పోలీస్ సిబ్బందికి సహకరించాలని పోలీసు కమిషనర్ డాక్టర్ రవిశంకర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఏఆర్వోలు, అదనపు ఆర్వోలు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

3 వేల మందితో బందోబస్తు

- నగరంలో 133 సున్నితమైన ప్రాంతాల గుర్తింపు
- 79 పెట్రోలింగ్ పార్టీల ఏర్పాటు
- ప్రతి నియోజకవర్గానికి ఒక క్విక్ రియాక్షన్ టీమ్
- 230 ట్రబుల్ మాంగర్స్, 650 రౌడీషీటర్ల బైండోవర్

విశాఖ సిటీ: ఏయూ పరిసర ప్రాంతాలు నిఘా నీడలోకి వెళ్లిపోయాయి. కౌంటింగ్ కేంద్రం వద్ద పెద్ద సంఖ్యలో పోలీస్ బలగాలు మోహరించాయి. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియకు పోలీసులు భారీ భద్రతా చర్యలు చేపడుతున్నారు. సుమారు 3 వేల మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. నగరమంతా 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. విశాఖలో 133 సున్నితమైన ప్రాంతాలను గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో గట్టి నిఘా పెట్టారు. 137 పికెట్స్, 79 పెట్రోలింగ్ పార్టీలతో పాటు ప్రతి నియోజకవర్గానికి ఒక క్విక్ రియాక్షన్ టీమ్‌లను సిద్ధం చేశారు. 230 ట్రబుల్ మాంగర్స్, 650 రౌడీ షీటర్లను బైండోవర్ చేశారు. ఏయూలోని కౌంటింగ్ కేంద్రాలలో ప్రత్యేకంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటితో పాటు సమస్యాత్మక, సున్నిత ప్రాంతాలతో పాటు ముఖ్య కూడళ్లన్నీ నిఘా కెమెరాలు, బాడీ వార్న్ కెమెరాలతో కమాండ్ అండ్ కంట్రోల్ రూంతో అనుసంధానం చేశారు.



మాట్లాడుతున్న సీపీ ఎ.రవిశంకర్

పోలీసులకు సహకరించాలి

కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు అందరూ పోలీసులకు సహకరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఏయూలో ఉన్న కౌంటింగ్ కేంద్రాలను సీపీ సందర్శించారు. తుది ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల భద్రతలో మొదటి అంచెలో విధులు నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ బలగాలకు దిశానిర్దేశాలు చేశారు.

మద్యం సేవిస్తే అనుమతిలేదు

మద్యం సేవించారని అనుమానం వస్తే బ్రీత్ అనలైజర్ల ద్వారా తనిఖీ చేయాలని సీపీ సూచించారు. ఉదయం 6.30 నుంచి 7.30 మధ్య పార్టీ శ్రేణులు ఎక్కువ మంది వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి కౌంటింగ్ కేంద్రం వద్ద ఎక్కువ సంఖ్యలో డీఎఫ్‌ఎండీలు ఏర్పాటు చేసి, ఎక్కువ మంది సిబ్బందితో తనిఖీలు నిర్వహించాలని చెప్పారు. తక్కువ సమయంలో లోపలకు పంపే ప్రయత్నం చేయాలన్నారు. పదునైన, ప్రమాదకరమైన వస్తువులను, మద్యాన్ని, అనుమతిలేని వ్యక్తులను అనుమతించకూడదన్నారు. అనుమతి కలిగిన వారి మొబైల్ ఫోన్లను, వారి అనుమతి పత్రం చూసి అనుమతించాలని, అందరితో సమన్వయం చేసుకుంటూ ఎటువంటి దుందుడుకు చర్యలు తీసుకోకుండా, ప్రశాంతంగా కౌంటింగ్ ప్రక్రియ ముగిసే విధంగా విధులు నిర్వహించాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ ముగిసిన తరువాత, తదుపరి ఆదేశాలు అందుకునే వరకూ అధికారులు, సిబ్బంది అందరూ వారికి కేటాయించిన విధులు వద్దే ఉండాలని చెప్పారు. ఏదైనా అనుకోని పరిస్థితులు తలెత్తితే వెంటనే పై అధికారులకు సమాచారం అందించాలని, ఎన్నికల విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే తక్షణం వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఏయూ ఇంజనీరింగ్ గ్రౌండ్‌లో అమర్చేందుకు తీసుకువస్తున్న మెటల్ డిటెక్టర్



ఎంట్రీ పాస్‌లను సిద్ధం చేస్తున్న పోలీసులు



కౌంటింగ్ విధుల కోసం వెళుతున్న ఉద్యోగులు

పట్టణ ఆరోగ్య కేంద్రాల తనిఖీ


పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులతో డిఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మద్దిలపాలెం : పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది అలసత్వం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి పి.జగదీశ్వరరావు అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలను డీఎంహెచ్‌వో సోమవారం తనిఖీలు చేశారు. దీనిలో భాగంగా ఇసుకతోట, విద్యుత్ నగర్, రంగిరీజు వీధి, గాంధీవీధి, చినవాల్తేరు పట్టణఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాల్లో స్పెషలిస్టుల సేవలపై ఆరా తీశారు. అలాగే ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆరోగ్య సేవలందించాలన్నారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఆరోగ్య సిబ్బంది ద్వారా అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ అందించేలా చూడాలన్నారు. స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. అవసరమైన మందులున్నాయా లేదా అనేది పరిశీలించారు. గర్భిణులు సిజేరియన్ కాకుండా సాధారణ ప్రసవలు జరిగేలా ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. డీఎంహెచ్‌వోతోపాటు డాక్టర్.బి.ఉమావతి, జిల్లా నోడల్ అధికారి శశిభూషన్, డీపీవో నాగభూషణ్, ఎంపీహెచ్ఈవో తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం మేలు


ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాఖ లీగల్: న్యాయస్థానాల్లో అపరిష్కృతంగా ఉన్న కేసుల రాజీకి మధ్యవర్తిత్వాన్ని అవలంబించడం అవసరమని విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. సోమవార జిల్లా కోర్ట్ ఆవరణలో నూతన భవన సముదాయంలోని న్యాయమూర్తుల సమావేశ మందిరంలో జరిగిన మీడియేషన్ అండ్ కన్సిలేషన్ శిక్షణా శిబిరాన్ని న్యాయమూర్తి ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల ప్రాథమిక దశలోనే మధ్యవర్తిత్వ విధానాన్ని అవలంబిస్తే 90 శాతం వరకు పెండింగ్ కేసుల పరిష్కారమయ్యే అవకాశం ఉందని న్యాయమూర్తి స్పష్టం చేశారు. మీడియేషన్ జాతీయ శిక్షకులు న్యూఢిల్లీ కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి నిషా సక్సేనా మాట్లాడుతూ సత్వర న్యాయం అందించే దిశగా న్యాయస్థానాలు రాజీ మార్గానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. సమయం, ఖర్చులతో పాటు శాశ్వత పరిష్కారం అందించే మధ్యవర్తిత్వ విధానం కక్షిదారులకు, న్యాయవాదులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. న్యూఢిల్లీ జ్యుడీషియల్ అకాడమీ కార్యదర్శి డాక్టర్ అధితి అగర్వాల్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రాథమిక స్థాయిలోనే కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకుంటే న్యాయస్థానాల్లో భారం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, ఉభయగోదావరి జిల్లాల నుంచి 29 మంది న్యాయమూర్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ శిక్షణ శిబిరం ఐదు రోజులపాటు కొనసాగుతుంది.

కానిస్టేబుల్ రమేష్ హత్య కేసులో

నిందితుడి ఆత్మహత్య

- మరో నిందితురాలు శివజ్యోతితో రాజయ్యపేటలో సహజీవనం
- ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో వివాదం
- మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడిన రామారావు

పెందుర్తి: నగరంలో గతేడాది సంచలనం సృష్టించిన కానిస్టేబుల్ బర్రి రమేష్ హత్య కేసులో నిందితుడు సియాద్రి రామారావు (30) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అదే హత్య కేసులో ప్రధాన నిందితురాలైన కానిస్టేబుల్ రమేష్ భార్య శివజ్యోతి అలియాస్ శివానీతో వివాదం కారణంగానే రామారావు ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఆదివారం రాత్రి పెందుర్తి మండలం రాజయ్యపేటలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి..నగరంలోని ఎంవీపీ ప్రాంతంలో నివాసం ఉంటున్న బర్రి రమేష్‌ను అతని భార్య శివానీ, ఆమె ప్రియుడు సియాద్రి రామారావు కలిసి గతేడాది ఆగస్టు 3న పథకం ప్రకారం హత్య చేశారు. దీనిపై ఇద్దరినీ పోలీసులు అరెస్ట్ చేయగా కొన్నాళ్ల క్రితం బెయిల్‌పై విడుదలయ్యారు. మూడు నెలల క్రితం పెందుర్తి మండలం రాజయ్యపేటలో ఇంటిని అద్దెకు తీసుకుని సహజీవనం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇద్దరికీ మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన రామారావు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం ఉదయం ఈ ఘటనపై సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని రామారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఆత్మహత్య చేసుకున్న రామారావు (ఫైల్)

పీఎంపాలెంలో 278 మద్యం బాటిళ్ల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో సీఐ రామకృష్ణ, పోలీసులు

మధురవాడ: పీఎంపాలెం ఆఖరి బస్టాప్ సమీపంలోని బక్కన్నపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం(బీ2) కాలనీలో 278 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ వై. రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పీఎంపాలెం నుంచి శంభువానిపాలెం వెళ్లే రోడ్డులో ఉన్న బీ2 కాలనీలో సోమవానం సాయంత్రం బుడుమూరి ప్రసాద్ అనే బెల్టుషాపు నిర్వాహకుడు వద్ద మద్యం ఉన్నట్టు వచ్చిన సమాచారంతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఆయన ఇంట్లో నిల్వ చేసిన 278 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, ప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్టు రామకృష్ణ తెలిపారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.72,110
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.66,100
వెండి(కిలో):	రూ.97,300

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.145
స్కిన్	: రూ.260
స్కిన్‌లెస్	: రూ.270

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	450.00
విజయనగరం	454.00
శ్రీకాకుళం	454.00

పలు రైళ్ల రీ షెడ్యూల్



తాటిచెట్లపాలెం: వివిధ స్టేషన్‌ల నుంచి రావలసిన పెయిరింగ్ రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నందున, వివిధ నిర్వహణ కారణాల వల్ల పలు రైళ్లు రీషెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ రైళ్లు బయల్దేరిన సమయాన్ని బట్టి అంతే ఆలస్యంగా ఆయా స్టేషన్‌లకు చేరుకోనున్నాయి. ప్రయాణికులు మార్పులను గమనించాలని రైల్వే అధికారులు సూచించారు.

సోమవారం రాత్రి 7.10గంటలకు విశాఖలో బయల్దేరవలసిన విశాఖప -తిరుపతి (08583) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ 3గంటలు ఆలస్యంగా రాత్రి 10.10గంటలకు బయల్దేరింది. సోమవారం సాయంత్రం 4.15గంటలకు బయల్దేరవలసిన హౌరా - కాన్యకుమారి (12665) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సుమారు 3గంటలు ఆలస్యంగా రాత్రి 6.30గంటలకు బయల్దేరింది. సోమవారం మధ్యాహ్నం 3.25గంటలకు బయల్దేరవలసిన షాలిమర్ - చెన్నై (12841) కోరమండల్ ఎక్స్‌ప్రెస్ సుమారు గంటన్నర ఆలస్యంగా సాయంత్రం 4.55గంటలకు బయల్దేరింది. సోమవారం మధ్యాహ్నం 3.50గంటలకు బయల్దేరవలసిన బెంగళూరు -విశాఖ (08544) సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ సుమారు రెండు గంటలు ఆలస్యంగా సాయంత్రం 5.45గంటలకు బయల్దేరింది.సోమవారం సాయంత్రం 5.25గంటలకు బయల్దేరవలసిన కన్యాకుమారి - డిబ్రూఘడ్ (22503) వివేక్ సూపర్ ఫాస్ట ఎక్స్‌ప్రెస్ సుమారు గంటన్నర ఆలస్యంగా రాత్రి 7గంటలకు బయల్దేరింది.సోమవారం సాయంత్రం 6గంటలకు బయల్దేరవలసిన సంత్రగచ్చి- తాంబరం (22841) అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ సుమారు 18గంటలు ఆలస్యంగా మంగళవారం మధ్యాహ్నం 12గంటలకు బయల్దేరుతుంది. మంగళవారం తెల్లవారు 3.55 గంటలకు బయల్దేరవలసిన సికింద్రాబాద్ - షాలిమర్ (12774) ఏసీ ఎక్స్‌ప్రెస్ 3గంటలు ఆలస్యంగా ఉదయం 6.55గంటలకు బయల్దేరుతుంది. బుధవారం ఉదయం 4.20గంటలకు విశాఖలో బయల్దేరలసిన విశాఖ - బెనారస్ (18311) వీక్లీ ఎక్స్‌ప్రెస్ సుమారు 3గంటలు ఆలస్యంగా ఉదయం 7.05గంటలకు బయల్దేరుతుంది.

దిశ దివ్యాంగ్ సురక్షకు 9 ఫిర్యాదులు


ఫిర్యాదు స్వీకరిస్తున్న సీపీ రవిశంకర్

విశాఖ సిటీ: దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా నిర్వహించిన డయల్ యువర్ సీపీ కార్యక్రానికి 9 మంది ఫిర్యాదులు చేశారు. దిశ దివ్యాంగ్ సురక్ష టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఫోన్, వీడియో కాల్స్ చేసి బాధితులు తమ సమస్యలను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్‌కు విన్నవించుకున్నారు. సైన్ లాంగ్వేజ్ తెలిసిన నిపుణురాలిని అందుబాటులో ఉంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో ఇతర రాష్ట్రాల నుంచి రెండు, ఇతర జిల్లాల నుంచి మూడు, విశాఖ నుంచి నాలుగు కాల్స్ వచ్చాయి. ఈ ఫిర్యాదులను వెంటనే సంబంధిత రాష్ట్రాల, జిల్లాల అధికారులకు రాతపూర్వకంగా పోస్టల్, వాట్సాప్ ద్వారా పంపించి, అవి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత నెల 15వ తేదీన నిర్వహించిన డయల్ యువర్ సీపీకి 4 ఫిర్యాదులు రాగా వాటిని పరిష్కరించారు.

ఓపెన్ పరీక్షలపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- ఆర్జేడీ విజయ భాస్కర్

విశాఖ విద్య: సార్వత్రిక విద్య విధానంలో జరిగే (ఓపెన్) టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి. విజయ భాస్కర్ అన్నారు. సోమవారం భీమునిపట్నం, ఆనందపురం మండలాల్లో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. పరీక్షలు ఎలా జరుగుతున్నాయనేది పరిశీలించారు. ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్షలు మాస్ కాపీయింగ్ ఆస్కారం లేకుండా చూడాలన్నారు. ఈ విషయంలో అలసత్వం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా సిబ్బంది అంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. ఓపెన్ పరీక్షలంటే చూచిరాతలనే ప్రచారం ఉందని, అలాంటి వాటికి తావివ్వకుండా చూడాల్సిన బాధ్యత ఇన్విజిలేటర్లపై ఉందన్నారు.

6, 7 తేదీల్లో బస్‌పాస్ కౌంటర్ల క్లోజ్

డాబాగార్డెన్స్: బస్‌పాస్ కౌంటర్లు ఆధునికీకరించనున్న కారణంగా ఈ నెల 6, 7 తేదీల్లో తెరవరని జిల్లా ప్రజా రవాణాధికారి అప్పలరాజు ప్రకటనలో పేర్కొన్నారు. 8వ తేదీ నుంచి యథావిధిగా బస్‌పాస్ కౌంటర్లు పనిచేస్తాయన్నారు. అలాగే బస్‌పాస్ వినియోగదారులు కొత్తగా ఐడీ కార్డు చేయించుకోవాలని, పాత ఐడీ కార్డుపై బస్‌పాస్ జారీ కాదని తెలిపారు.

ఇంటర్ డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ విన్నర్ విశాఖ జోన్


ఇంటర్ డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ విన్నర్‌గా నిలిచిన విశాఖ జోన్ జట్టు

తగరపువలస: ఈ నెల 6,7,8వ తేదీల్లో విజయవాడలో జరగనున్న జూనియర్ బాయ్స్ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ చాంపియన్ పోటీలకు విశాఖ జోన్ జట్టు విన్నర్స్‌గా నిలిచింది. సోమవారం కొమ్మాది విజ్ఞాస్ గ్రౌండ్‌లో జరిగిన టోర్నమెంట్‌లో అనకాపల్లి, విశాఖ జోన్ జట్లు పాల్గొన్నాయి. వీటితో బెస్ట్ ఆఫ్ త్రీ ఆడించగా విశాఖ జోన్ జట్టు విన్నర్‌గా గెలిచి విజయవాడలో జరుగు ఇంటర్ డిస్ట్రిక్ట్ టోర్నమెంట్‌కు వెళ్లనుంది. ఈ కార్యక్రమంలో జోన్ ఇంచార్జ్ ఎస్.జె.రామకృష్ణ, కోచ్ శేషుమోహన్, వీడీఎఫ్ఏ కార్యదర్శి అక్కరమాని చినబాబు, రాజారావు, మాని తదితరులు పాల్గొన్నారు.

జీతాలపై యాజమాన్యంతో కార్మిక సంఘాల భేటీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల జీతాలపై కార్మిక సంఘాలు యాజమాన్యంతో భేటీ అయ్యాయి. కార్మిక నాయకులు సమాచారం మేరకు సోమవారం మధ్యాహ్నం ఉక్కు పరిపాలన భవనానికి వెళ్లిన నాయకులు సీఎండీ అందుబాటులో లేకపోవడంతో డైరెక్టర్ (పర్సనల్) పాండే, డైరెక్టర్ (ఫైనాన్స్) గణేష్‌లతో సమావేశమయ్యారు. పిల్లలకు ఫీజులు కట్టాల్సి ఉన్నందున వెంటనే జీతాలు చెల్లించాలని కార్మిక నాయకులు డిమాండ్ చేశారు. దీనిపై యాజమాన్యం ప్రస్తుత పరిస్థితులు, ఖర్చుల నేపథ్యంలో ఈనెల 15న ఇస్తామని చెప్పినట్టు నాయకులు తెలిపారు. దీనిపై నిరసన వ్యక్తం చేసిన కార్మిక నాయకులు బుధవారంలోగా జీతాలు ఇవ్వకపోతే ఆందోళన చేస్తామని స్పష్టం చేసి వెనుతిరిగారు. సమావేశంలో కార్మిక నాయకులు డి. ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, మంత్రి రాజశేఖర్, జె. అయోధ్యరామ్, జి. గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏయూకు సెలవు



ఏయూక్యాంపస్ : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయానికి సెలవు ప్రకటించారు. ఎన్నికలు పూర్తయిన తరువాత ఈవీఎంలను ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలోనే భద్రపరిచారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఓట్ల లెక్కింపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జరగనుంది. భద్రతా కారణాల దృష్ట్యా వర్సిటీలో పూర్తిస్థాయిలో పోలీసులు పహారా ఏర్పాటు చేశారు. ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వర్సిటీ అధికారులు ముందు జాగ్రత్తగా ఏయూకు సెలవు ప్రకటించారు.

భారీ వర్షానికి కూలిన ఇల్లు

డాబాగార్డెన్స్: నగరంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఓ ఇల్లు నేలమట్టమైంది. ఆ ఇల్లు ఖాళీగా ఉండడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. వివరాలిలా ఉన్నాయి. పాత నగరం గొల్లవీధి మసీదు జంక్షన్ సమీపాన డోరు నంబరు 20-100-5 గల ఇల్లు ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఒక్కసారిగా కుప్పకూలింది. ఇదిలా వుండగా ఇంటి యజమాని కాశి వేరే ప్రాంతానికి వెళ్లిపోయారు. ఇల్లు కూలిందని సమాచారం ఇచ్చినా రాలేదని పరిసర ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్ధరాత్రి ఇల్లు కూలిన నేపథ్యంలో ఇంటికి సంబంధించిన విద్యుత్ వైర్లు నడిరోడ్డుపై వేలాడాయి. ఇటు విద్యుత్ సిబ్బందికి..పోలీసులకు..జీవీఎంసీ దృష్టికి తీసుకెళ్లినా ఉదయం 10 గంటల వరకు ఎవరూ స్పందించలేదని స్థానికులు వాపోయారు.


గొల్లవీధిలో కూలిపోయిన ఇల్లు

1999 తరువాత రంపచోడవరంలో మళ్లీ లెక్కింపు

- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- మోహరించిన పోలీసు బలగాలు

రంపచోడవరం: నియోజకవర్గ కేంద్రం రంపచోడవరంలో 25 సంవత్సరాల తరువాత మళ్లీ ఇప్పుడు ఓట్ల లెక్కింపు నిర్వహిస్తున్నారు.1999లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఇక్కడ ఓట్లు లెక్కింపు జరిగింది. తరువాత జరిగిన 2004 ఎన్నికల కౌంటింగ్ రాజమహేంద్రవరం సమీపంలోని బొమ్మూరులో నిర్వహించారు. తరువాత 2009, 2014, 2019 ఎన్నికల కౌంటింగ్ కాకినాడలో నిర్వహించారు. కొత్త జిల్లాల ఏర్పాటు తరువాత రంపచోడవరం నియోజకవర్గాన్ని తూర్పు గోదావరి జిల్లా నుంచి తప్పించి అల్లూరి సీతారామరాజు జిల్లాలో చేర్చారు. ఏజెన్సీలో ప్రాంతంలో ఎన్నికల నిర్వహణ అధికారులకు కత్తిమీద సాముగా ఉంటుంది. పోలింగ్ జరిగిన తరువాత ఈవీఎంలను జిల్లా కేంద్రం పాడేరులోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించడం చాలా కష్టతరమైన అంశం. దీంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో రంపచోడవరంలో కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. రంపచోడవరం నియోజకవర్గంలో 2,77,317 మంది ఓటర్లు ఉండగా ఈ ఎన్నికల్లో 2,08,025 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 75.01 శాతం పోలింగ్ నమోదయింది. ఏజెన్సీ ప్రాంతం కావడంతో పోలింగ్‌ను సాయంత్రం 4 గంటలకే ముగించారు. రంపచోడవరంలో నియోజకవర్గానికి సంబంధించి అసెంబ్లీకి 20 రౌండ్లు, పార్లమెంట్‌కు 20 రౌండ్లలో ఓట్లు లెక్కించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు

రంపచోడవరం ప్రభుత్వ గిరిజన సంక్షేమ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, ఆర్వో ప్రశాంత్‌కుమార్‌లు పరిశీలించారు.అరకు పార్లమెంట్ స్థానం ఓట్లు లెక్కింపును రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, అసెంబ్లీ ఓట్ల లెక్కింపును ఆర్వో ప్రశాంత్‌కుమార్ పర్యవేక్షిస్తారు. భద్రత ఏర్పాట్లను ఏఎస్పీ జగదీష్ అడహళ్లి పరిశీలించారు. ఎన్నికల లెక్కింపు జరుగుతున్న రంపచోడవరానికి వివిధ మండలాల నుంచి ఎవరు రాకుండా పోలీస్ అధికారులు ఎక్కడిక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఐ పోలవరం జంక్షన్ వద్ద పోలీస్ చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. వాహనాల్లో ఎక్కువ మంది ప్రయాణిస్తే వారిని నిలిపివేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.రంపచోడవరం అంబేడ్కర్ సెంటర్‌లో కూడా పోలీసు బలగాలు మోహరించాయి. కౌంటింగ్ కేంద్రం నుంచి రంపచోడవరం సెంటర్ వరకు ఎటువంటి రాకపోకలు జరగకుండా ఆంక్షలు విధించారు.


కౌంటింగ్ ఏర్పాట్లును పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

కన్నకొడుకే కాలయముడు

తాగుడుకు డబ్బులు ఇవ్వలేదని... తల్లిని హత్య చేసి పరారీ


ఆదమ్మ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రవికుమార్

గంగవరం: జన్మనిచ్చిన పాపానికి ఓ తల్లిపాలిట కన్నకొడుకే కాలయముడిగా మారాడు. తాగేందుకు డబ్బులివ్వలేదన్న కోపంతో కన్నతల్లి అని కూడా చూడకుండా గోడకు తలను కొట్టి హతమార్చాడు. ఈ హృదయ విదారకర సంఘటన మండలంలోని నూగుమామిడిలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ బి.రామకృష్ణ తెలిపిన వివరాలు... కొలుతూరి అబ్బాయి, ఆదమ్మ(54) భార్యాభర్తలు. వీరికి వివాహాలైన ఇద్దరు కొడుకులున్నారు. పెద్ద కొడుకు బాలయ్య భార్యతో కలిసి అదే గ్రామంలో నివాసముంటున్నాడు. చిన్నకొడుకు కృష్ణను భార్య విడిచి వెళ్లిపోవడంతో గ్రామంలోనే తల్లిదండ్రులతో ఉంటున్నాడు. నిత్యం తాగుతూ తిరగడమే పనిగా పెట్టుకున్నాడు. రోజులాగే తాగేందుకు ఆదివారం రాత్రి కూడా తల్లిని డబ్బులు అడిగాడు. ఆమె డబ్బులు ఇవ్వకపోడంతో గొడవపడ్డాడు. తీవ్ర ఆగ్రహంతో తల్లి తలను గోడకు కొట్టాడు. గొడవ జరగడంతో కొడుకు తనను కూడా కొడతాడేమోనని భయపడి తండ్రి అక్కడి నుంచి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన తల్లి ఆదమ్మ సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. తల్లిని హత్య చేసి కృష్ణ పరారయ్యాడని, మృతదేహాన్ని పోస్టుమార్టానికి అడ్డతీగల ప్రభుత్వాస్పత్రికి తరలించామని ఎస్ఐ తెలిపారు. అడ్డతీగల సీఐ రవికుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారని, ఆయన ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఎస్బీ హెచ్‌సీ రాజారావు వివరాలు సేకరించారు.


వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

కార్మిక లోకానికి ఆదర్శం సత్యనారాయణ జీవితం

అనకాపల్లి : బడుగు, బలహీన వర్గ ప్రయోజనాల కోసం దేశంలో సీఐటీయూ ఏర్పాటు చేసిన పరస సత్యనారాయణ ఆశయ సాధనకు కార్మిక లోకం కృషి చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సత్యనారాయణ శతజయంతి వేడుకలను పురస్కరించుకుని సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఐటీయు వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, తెలంగాణ పోరాట వీరుడు కామ్రేడ్ సత్యనారాయణ శత జయంతి వేడుకలు దేశవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. తన జీవితాంతం బడుగు బలహీన వర్గాలు, కార్మిక వర్గ ప్రయోజనాల కోసం కృషి చేసి చిరస్థాయిగా నిలిచినట్టు తెలిపారు. నేటి కార్మిక వర్గం ఆయన స్ఫూర్తి పొందాలని వాడవాడల కార్మికుల ఐక్యం చేయడం, వారి సమస్యలపై పోరాడడం నిత్య కృత్యంగా మారాలన్నారు. నేటి సమకాలీన రాజకీయాలలో నిస్వార్థంగా పనిచేయడంతో పాటు, ప్రభుత్వాలు పెట్టే అన్ని రకాల నిర్బంధాలను, ఆటుపోట్లు తట్టుకొని నిలబడిన సత్యనారాయణ జీవితం ఆదర్శనీయమన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. లోకనాథం మాట్లాడుతూ కార్మిక వర్గం సమస్యల పోరాటానికి సత్యనారాయణ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ నేటి తరానికి నికార్సయిన ఆదర్శమూర్తి సత్యనారాయణ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.నాగేశు, జిల్లా అధ్యక్షుడు శంకరరావు, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల రాష్ట్ర అధ్యక్షులు గూనూరు వరలక్ష్మి, వీఓఏ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.రూపాదేవి, రాష్ట్ర కమిటీ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ, ఆశా వర్కర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎల్ శాంతి పాల్గొన్నారు.


సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీహెచ్.నర్సింగరావు